www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 23 | జూన్ | 2026 పేజీలు : 8

## సేవ్ మణుగూరు పోరాటాన్ని విజయవంతం చేయండి



కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

2లో

## మహిళా సాధికారతకు పెద్దపీట

-రూ.67వేల కోట్ల వడ్డీలేని రుణాలు పంపిణీ
-ఇందిరమ్మ ఇండ్లతో పేదలకు అండ
-నారి భేటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి





ప్రజాపక్షం/ఖమ్మం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం ఆహోర్నిశలు శ్రమిస్తుందని రెండున్నర ఏళ్ల కాలంలో రూ.67వేల కోట్ల వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశామని ఐదేండ్లలో లక్ష కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాల పంపిణీయే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఆయన తెలిపారు. మిగతా 2లో..

## ఇసుక మాఫియా చేష్టలకు ఓ యువకుని బలి

ప్రజాపక్షం/మణుగూరు : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇసుక మాఫియా చేలరేగిపోతుంది. ఇష్టానుసారంగా రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలపడం, మితిమీరిన లోడింగ్‌తో నిబంధనలను పాటించకుండా వాహనాలను పరుగెత్తించడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇక రహదారి ఇతర వాహనాలకు చోటు ఇవ్వకపోవడం ప్రశ్నిస్తే దాడులకు దిగడం ఈ ప్రాంతంలో నిత్యకృత్యమైంది. సోమవారం నాడు ఈ ఇసుక మాఫియా నిర్లక్ష్య ధోరణికి ఓ వ్యక్తి ప్రాణాలను కోల్పోయాడు. వివరాల్లోకి వెళితే.... సోమవారం సాంబాయిగూడెం నుంచి రామానుజవరం వరకు పెద్ద సంఖ్యలో ఇసుక లారీలను నిలిపి కనీసం వాహనాలు వెళ్లేందుకు అవకాశం ఇవ్వలేదు. వాహనదారులు ఇబ్బందులు పడుతున్న క్రమంలోనే సమీపంలో గల దమ్మక్కపేటలో వంశీ (35) అనే యువకుడు మిగతా 2లో..



## కాంగ్రెస్ పాలనలో రైతాంగం అరిగోస

-రైతుబంధును ఓట్ల పండుగగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం
-ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వం
-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

2లో..



# మాతృత్వానికి మాయని మచ్చ..!



-బలవుతున్న చిన్నారులు
-ఆందోళనకు గురి చేస్తున్న వరుస ఘటనలు

ప్రజాపక్షం/ ఖమ్మం : పేగు తెంచి జన్మనిచ్చిన బిడ్డల పట్ల అత్యంత కర్కశంగా వ్యవహరిస్తూ మాతృత్వానికి మాయని మచ్చగా కొందరు తల్లులు మిగులుతున్నారు. సహనం కోల్పోయి ఏమి చేస్తున్నారో అర్థం కాని స్థితి ఏర్పడుతుంది. పిల్లలకు చిన్న దెబ్బ తగిలితేనే విలవిలలాడే తల్లుల హృదయం ఎందుకు పాశనంగా మారుతుందో అర్థం కావడం లేదు. తామన్నదే జరగాలన్న పట్టుదల, అనైతిక పనులు, ఆర్థిక సమస్యలు చివరకు తల్లుల హృదయాన్నే పాశనంగా మారుస్తున్నాయి. రాష్ట్రంలో జరిగిన వరుస ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లో తన అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి రెండేళ్ల తన కొడుకును హతమార్చింది ఓ తల్లి. చివరకు దానికి ఓ కట్టుకథ అల్లి తప్పించుకునే ప్రయత్నం చేసింది. సాధారణంగా ఏ పిల్లలకు దెబ్బ తగిలిన స్త్రీ హృదయం స్పందిస్తుంది. ఓదార్చేందుకు ప్రయత్నం చేస్తుంది. కానీ ఇక్కడ కన్నకొడుకునే హతమార్చిందంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అవగతం చేసుకోవచ్చు. ఆదివారం తన సొంత ఊరు వెళ్దామన్న భర్త మాటను శిరసావహించలేక తాను మరణిస్తూ పిల్లలను కూడా చంపేయాలని భావించింది ఓ తల్లి. చిన్నారులకు బిస్కెట్లలో ఎలుకల మందు కలిపి తినిపించింది. పైగా ఏదో జరిగిందని భర్తకు సమాచారం ఇచ్చింది. పెద్ద కుమారుడు వేదకుమార్ ఇంటి వద్దనే



కన్నుమూశాడు. చిన్నకుమారుడు తనిష్క్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలను కోల్పోయాడు. తల్లి స్వాతి కూడా చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంది. ఈ ఘటన చాలా మందిని కలిచివేసింది. గతంలో సైతం అక్రమ సంబంధాలకు అడ్డుగా ఉన్నారని తల్లులే పిల్లలను హతమార్చిన ఘటనలు చోటు చేసుకున్నాయి. మారుతున్న పరిస్థితులు ఈ స్థితికి మిగతా 2లో..

# 30న రైతు ఆశీర్వాద సభ



**-సభలో రైతు భరోసా నిధుల విడుదల**
**-28, 29న అగ్రి ఎక్స్‌పో**
**-చారిత్రిక సభకు రెండు లక్షల మంది**
**-ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క**
**-బహిరంగ సభా స్థలిని పరిశీలించిన భట్టి విక్రమార్క**



**ప్రజాపక్షం/ఖమ్మం/చింతకాని :** రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని ఈ క్రమంలో జూన్ 30న రైతాంగ ఆశీర్వాద సభను చింతకాని మండలం జగన్నాథపురంలో నిర్వహించ నున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఈ సందర్భంగా రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విడుదల చేస్తారని ఆయన తెలిపారు. సోమవారం బహిరంగ సభా స్థలిని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్‌లతో కలిసి పరిశీలించారు. రెండు మూడు ప్రాంతాలను పరిశీలించిన భట్టి విక్రమార్క చివరకు జగన్నాథ పురం వద్ద ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విక్రమార్క మాట్లాడుతూ రైతాంగ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మధిర శాసన సభ నియోజక వర్గ చరిత్రలోనే మునుపెన్నడు లేని విధంగా ఒక చారిత్రిక సభను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మధిర నియోజక వర్గంలో ఏర్పాటవుతున్న సభ ఇది అని ఆయన తెలిపారు. సభకు ముందు 28, 29 తేదీల్లో వ్యవసాయ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగ అభివృద్ధి, శాస్త్రీయత తదితర విషయాలకు సంబంధించి 150 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వేలాది మంది రైతులకు అనేక విషయాలపై ఈ సందర్భంగా అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి బూత్ నుంచి వంద మంది జనాభాకు ఒకరిని ఇంచార్జీగా నియమించి ఖచ్చితమైన జాబితాను ఫోన్ నెంబర్‌తో సహా సిద్ధం చేయాలని ఆయన సూచించారు. సభ పకడ్బందీగా నిర్వహించేందుకు ఆరు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. పోలీస్ వ్యవస్థ పైనే భారం వేయకుండా ముఖ్య నాయకులను గుర్తించి గౌరవంగా వేదికపైకి ఆహ్వానించేందుకు ప్రత్యేక వాలంటీర్లను గేట్ల వద్ద నియమించాలని ఆయన సూచించారు. రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను మరోసారి రుజువు చేయాలన్నారు. స్థల పరిశీలన కార్యక్రమంలో వైరా శాసన సభ్యులు రాందాస్ నాయక్, కార్పోరేషన్ ఛైర్మన్లు రాయల నాగేశ్వర రావు, నాయుడు సత్యనారాయణ, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, మత్కేపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, చింతకాని మండల అధ్యక్షులు కన్నెబోయిన గోపి, మండల మహిళా అధ్యక్షురాలు తోటకూరి ప్రగతి, సర్పంచ్ తాళ్లూరి స్వప్న, నియోజక వర్గంలోని పలు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెన్షనర్ల సమస్యలను పరిష్కరించండి




**-హెల్త్‌కార్డులు సత్వరమే ఇవ్వాలి**
**-డిఏ బకాయిలు మంజూరు చేయాలి**
**-ఎస్‌జిపిఏటి రాష్ట్ర కార్యదర్శి మేరీ ఏసుపాదం**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సమస్యలతో సతమతవుతున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎస్‌జిపిఏటి రాష్ట్ర కార్యదర్శి వి. మేరీ ఏసుపాదం, జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జిపిఏటి) పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్‌లో అడ్మినిస్ట్రేటివ్ అధికారి కారు మంచి శ్రీనివాస్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్లకు తక్షణమే నగదు రహిత వైద్యం అందేలా హెల్త్ కార్డులు అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు విడతల డిఏను వెంటనే మంజూరు చేయాలని, పిఆర్‌సిని సత్వరమే ప్రకటించి అమలు చేయాలని కోరారు. ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల బకాయిలను సత్వరమే చెల్లించాలని ఎస్‌జిపిఏటి తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లకు ఎస్‌జిపిఏటి ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కనపర్తి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పెదమాళ్ల సత్యనారాయణ, కొలికొండ శరత్ బాబు, ఊడుగు వెంకటేశ్వర్లు, జల్లా వెంకటేశ్వర్లు, మహిళా కార్యదర్శి తాడి అంజలి, టిపిటిఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి మనోహర్‌రాజు, ఎంఈవో పి. నాగిరెడ్డి, జిల్లా నాయకులు బెల్లం రాధాకృష్ణమూర్తి, జి. మధుకర్ రెడ్డి, ఊడుగు సుధాకర్, ఎండి హుస్సేన్, కృష్ణారావు, ప్రసాద రావు, రామారావు, వెంకటేశ్వరరావు, సాగర్, రామకృష్ణ, వీరభద్రం, మధుసూదన్‌రెడ్డి, నాగేశ్వరరావు, ఆదినారాయణ, పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

# అనుమతులు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

**-ఫీజుల దోపిడీని అరికట్టాలి**
**-ప్రైవేటు కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ధర్నా**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు ఇంటర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్న ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు కళాశాల ఎదుట ఎఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలను నియంత్రించడంలో ప్రభుత్వం, అధికారులు ద్వంద వైఖరిని అవలంభిస్తున్నారన్నారు. విద్యను వ్యాపారం చేస్తూ కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు మార్కెట్‌ను తలపిస్తున్నాయన్నారు. విద్యాశాఖాధికారులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అడ్మిషన్లు, డోనేషన్లు, బుక్స్, యూనిఫామ్స్ అంటూ తల్లిదండ్రుల నుంచి దోచుకుంటున్నారన్నారు. విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ కనీస సౌకర్యాలు కల్పించకుండా లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని, రంగు రంగుల బ్రోచర్లు, ప్రచారాలతో విద్యార్థులను, తల్లిదండ్రులను బురిడి కొట్టిస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేని కళాశాలలపై చర్యలు తీసుకోకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దాడులు చేస్తామని హెచ్చరించారు. విద్యాశాఖాధికారి ఎన్నో ఏళ్లుగా ఇక్కడే ఉంటూ ప్రైవేటు కళాశాలలకు అండగా ఉంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయని తక్షణమే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ నాగులమీరా, బుర్రా మనోజ్, చిన్నంశెట్టి ఆకాష్, నాయకులు పవన్, వెంకి కుమార్, నరేందర్, ఉమేష్, పవన్‌సాయి, గోపి, సుకుమార్ పాల్గొన్నారు.

# నేడు బికెఎంయు ధర్నా

**-కలెక్టరేట్ ఎదుట ఆందోళన**

**ప్రజాపక్షం/ఖమ్మం :** విబి జీ రాంజీ పథకాన్ని ఉప సంహరించుకుని యధావిధిగా మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) అనుబంధ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధికి తిలోదకాలు ఇచ్చేందుకే విబిజీ రాం జీ పథకాన్ని జూలై ఒకటి నుంచి అమలు చేయాలని యత్నిస్తుందని వారు తెలిపారు. పని రోజులు తగ్గించడం, రోజు వారి కూలీకి సంబంధించి కూడా సరైన రీతిలో గిట్టుబాటు కాకుండా చేయడం, రెండు సార్లు ఫోటో తీసే పద్ధతి ప్రవేశపెట్టడం వంటివి, ఉపాధి హామీ పథకం రద్దు క్రమంలోనే చోటు చేసుకుంటున్నాయని వారు తెలిపారు. ఈ క్రమంలో విబిజీ రాంజీ పథకాన్ని రద్దు చేసి యధావిధిగా పాత నిబంధనల మేరకే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టడంతో పాటు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు.

# గీతపనివార్ల సంఘం సభ్యత్వ ప్రారంభం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** గీతపనివార్ల సంఘం సభ్యత్వ ప్రారంభ కార్యక్రమాన్ని సోమవారం రాష్ట్ర నాయకులు, ప్రముఖ న్యాయవాది బొమ్మగాని ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గీతపనివార్ల సమస్యల పరిష్కారం కోసం కృషి జరుగుతుందన్నారు. సంస్థాగత నిర్మాణాన్ని పూర్తి చేసుకుని ప్రజా ఆందోళనలకు, డిమాండ్ల సాధనకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నాగభూషణం, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తొండల సత్యనారాయణ, దూసరి శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# ఇసుక, కంకర, మట్టి, యాష్ రవాణా వాహనాలకు పైకప్పు ఉండాలని సీఐకు వినతి




**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** ఇసుక, కంకర, మట్టి, యాష్ రవాణా వాహనాలు పైకప్పు ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సీఐ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. పురపాలక పరిధిలో రాత్రి, పగలు తేడాలేకుండా ఇసుక, కంకర, మట్టి, యాష్ లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు కనీసం పైకప్పు కూడా లేకుండా వా హనాలు తోలడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారు తీసుకెళ్లే మెటీరియల్స్ రహదారుల మీద పడి వాహనదారులు తరుచూ ప్రమాదాలబారిన పడుతున్నారని పార్టీ తరుపున కోరుతున్నట్లు తెలిపారు. ఈ విషయమై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేనిపక్ష్యంలో ఉద్యమానికి పిలుపునిస్తామని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి, ఎం.ఎ.రహీం, మధిర మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు, జిల్లా సమితి సభ్యుడు పెరుమాళ్లపల్లి ప్రకాశరావు, మండల కార్యవర్గ సభ్యులు పంగా శేషగిరి, మంగళగిరి రామానుజం, సిరివేరు శ్రీను, చింతపట్ల కృష్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# పంటల భీమా పథకాన్ని అమలు చేయాలి



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** రైతులకు తక్షణమే పంటలభీమా పథకాన్ని అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, రైతు సంఘం నాయకుడు బెజవాడ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ అనుబంధ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించి మాట్లాడారు. డీజిల్, పెట్రోల్, ఎరువుల ధరలు పెంచి రైతుల, ప్రజలపై ఆర్థికభారం మోపిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రూ.2లక్షలు పైన ఉన్న పంట రుణమాఫీ చేస్తామని నేటి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పథకాల ప్రచారాలు చేస్తూ కాలయాపన చేస్తోందని విమర్శించారు. తక్షణమే రైతులకు రూ.2లక్షలపైన రుణాలను మాఫీ చేసి, రైతు భరోసా, పంట పెట్టుబడి సాయం మొత్తం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పంగా శేషగిరి, నాయకులు ఊట్ల కొండలరావు, పెరుమాళ్లపల్లి ప్రకాశరావు, రామానుజం, శ్రీను, కృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో గేదె మృతి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** అధికారుల నిర్లక్ష్యంతో మూగజీవాల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. మండల పరిధిలోని అప్పలనరసింహాపురం సోమవారం ఈదురుగాలులు, చిరుజల్లులకు విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఈ క్రమంలో పశువుల మేతకు వెళ్లిన గేదెలు, గొర్రెలు, మేకలకు, పెంపకందారులకు పెనుప్రమాదం తప్పిం ది. ఎనికె నరసింహారావు అనే రైతుకు చెందిన గేదెకు పూర్తిగా విద్యుత్ తీగలు చుట్టుకోవడంతో విద్యుద్ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతిచెందిన గేదె విలువ రూ.1.50లక్షలు విలువ ఉంటుందని రైతు వాపోయారు. ఇటీవల కాలంలో మండల వ్యాపితంగా విద్యుద్ఘాతానికి ఎన్నో మూగజీవాలు మృత్యువాతబడ్డాయి. సిబ్బంది నిర్లక్ష్యంతోనే విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈమేరకు బాధితుడు పోలీసులకు, విద్యుత్‌శాఖకు ఫిర్యాధు చేశారు. ఈ ఘటనపై పూర్తి విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## టీజీఎంఆర్ఎస్ బూర్గంపాడు పాఠశాలపై జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రశంసలు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం టీజీఎంఆర్ఎస్ బూర్గంపాడు బాలికల పాఠశాలను సందర్శించి, పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ తరగతి గదులు, సిక్ రూమ్, ప్రొవిజన్స్ రూమ్, వంటగదిని పరిశీలించి పరిశుభ్రత, క్రమశిక్షణ, నిర్వహణ ప్రమాణాలను అభినందించారు. విద్యార్థినులకు అందిస్తున్న సౌకర్యాదలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందితో సమావేశమైన ఆయన విద్యార్థుల అభివృద్ధికి వారి కృషిని కొనియాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పివి గీతాజ్యోతి విద్యాసంస్థ ఆదర్శవంతంగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్థాయిలో విద్యా ప్రమాణాలు, పరిశుభ్రత కొనసాగించాలని సూచించారు. కలెక్టర్ సందర్శనతో పాఠశాల సిబ్బంది, విద్యార్థినుల్లో ఉత్సాహం నెలకొంది.

## గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని అంజనాపురం గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. సొంత గ్రామంలోని ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సపావట్ శంకర్(47)సోమవారం ఉదయం తన వ్యవసాయ పొలంలో పని చేస్తుండగా గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం శంకర్ ఇటీవల కాలం వరకు మోరంపల్లి బంజర్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆయన తన స్వగ్రామమైన అంజనాపురం పాఠశాలకే బదిలీపై వచ్చారు. ఈ క్రమంలో సోమవారం ఉదయాన్నే మోరంపల్లిబంజర్ గ్రామంలో టిఫిన్ చేసిన శంకర్, పాఠశాల ప్రారంభ సమయానికి సమయం ఉండటంతో, ఆ లోపు తన పొలంలో వరి నారు చల్లేందుకు విత్తనాలు తీసుకుని వెళ్లారు. అయితే పొలంలో పనులు చేసుకుంటున్న సమయంలోనే ఆయనకు ఆకస్మాత్తుగా తీవ్రమైన గుండెపోటు వచ్చింది. దీంతో ఆయన పొలంలోనే కుప్పకూలి హఠాన్మరణం చెందారు. మృతుడు శంకర్‌కు భార్య శరణ్య, ఇంటర్ చదువుతున్న ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిన్నటి వరకు తమతో ఎంతో యాక్టివ్‌గా ఉన్న శంకర్ ఇలా గుండెపోటుతో ఆకస్మికంగా మరణించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. శంకర్ మృతితో అంజనాపురం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. శంకర్ అకాల మరణం పట్ల పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తోటి ఉపాధ్యాయులు తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## పెంచిన ధరలను తగ్గించాలి



**ప్రజాపక్షం/ఏన్కూరు:** పెంచిన ఎరువులు, డీజిల్, పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందిగా మారిన యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేసి పాత విధానంలో ఎరువుల పంపిణీ కొనసాగించాలని కోరారు. రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయడంతో పాటు రైతు బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించి బోనస్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు తాళ్లూరి రమణ, నాయకులు మదినేని రమేష్, నరేష్, రామకృష్ణ, బసవయ్య, వెంకటేశ్వర్లు, ఎల్లయ్య పాల్గొన్నారు.

## గ్రామాల్లో సేవ చేసే గుణం అందరికీ ఉండాలి



**ప్రజాపక్షం/ఏన్కూరు:** గ్రామాల్లో సేవాభావంతో పని చేసే గుణం ప్రతి ఒక్కరిలో ఉండాలని వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. ఏన్కూరులో గ్రామీణ వైద్యుడు కొలిశెట్టి నరేష్ తన తండ్రి కొలిశెట్టి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎంఎల్ఏ ప్రారంభించారు. ఈసందర్భంగా రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం కొత్త మేడేపల్లి గొత్తికోయ గిరిజనులకు ఎంఎల్ఏ చేతుల మీదుగా నిత్యావసర వస్తువులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దూర ప్రాంత గిరిజనులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న గ్రామీణ వైద్యుడు కొలిశెట్టి నరేష్ సేవలను అభినందించారు. గొత్తికోయ గిరిజనుల అభివృద్ధికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. గిరిజన పిల్లల విద్యాభివృద్ధి కోసం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి కంటైనర్ పాఠశాల మంజూరు చేయించినట్లు తెలిపారు. అలాగే గ్రామానికి సోలార్ విద్యుత్, రహదారి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గుగులోత్ లచ్చిరామ్ నాయక్, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు స్వర్ణ నరేంద్ర కుమార్, జిల్లా నాయకుడు తంబళ్ల సామేలు, ఓబీసీ సంఘం మండల అధ్యక్షుడు మొగిలి నాగరాజు, నాయకులు మేడా ధర్మారావు, చింతనబోయిన సీతారాములు, చందమామ నరసింహారావు, పంతగాని నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలి

- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం
- తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా







**ప్రజాపక్షం/పాల్వంచ :** రైతాంగానికి గుదిబండగా ఉన్నటువంటి యూరియా యాప్‌ను ఎత్తివేసి రైతుకు సరిపడా యూరియాను అందజేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. సోమవారం రైతాంగ సమస్యలను పరిష్కరించాలని సిపిఐ కార్యాలయం చండ్రా రాజేశ్వరరావు భవన్ నుండి పోస్టాఫీసు సెంటర్, మునిసిపల్ డివిజన్ కార్యాలయం మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ ధర్నా చేపట్టారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం విశ్వనాథం మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రభుత్వం కుట్ర పూరితంగా రైతు వ్యతిరేక విధానాలను కొనసాగిస్తూ కార్పోరేట్ వర్గాలకు అనుకూలంగా చట్టాల రూపకల్పన చేస్తున్నదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు రైతాంగానికి శాపంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ సీజన్ ప్రారంభ దశలో రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలను అందజేయాలని బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు ఇప్పించాలన్నారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులను విక్రయిస్తూ రైతులను నిలువునా ముంచుతున్న వ్యాపారులపై పిడి యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, సాగు చేస్తున్న భూమి మొత్తానికి ఒకేసారి రైతు భరోసాను రైతు ఖాతాలో జమ చేయాలని, రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, 47వ, డివిజన్ కార్పోరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కమిటి సభ్యులు వైఎస్.గిరి, శనిగారపు శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా నాయకులు వీసంశెట్టి పద్మజ, నిమ్మల రాంబాబు, అన్నారపు వెంకటేశ్వర్లు, కొత్తగూడెం మార్కెట్ కమిటి సభ్యులు బానోత్ రవి, వాడె లక్ష్మి, రైతు సంఘం కార్యదర్శి బానోత్ రంజిత్, నాయకులు ఎస్ఏ. రహమాన్, గౌస్‌పాషా, కాకటి రవీందర్, బదావత్ శ్రీను, జర్పుల కిషన్, ఎడవల్లి క్రిష్ణ, బి. లింగస్వామి, భూక్యా హుస్సేన్, సర్వయ్య, ఎస్‌కే. గౌస్, ఎండి జానీ, కాసీం, మాలోత్ సక్రు, ధర్మసోత్ రాందాస్, ఆదిలక్ష్మి, సంజీవరావు, కోమటి శ్రీనివాసరావు, తాటి నాగరాజు, ఆది నారాయణ, రామడుగు రామాచారి, రాజమ్మ, వెంకటమ్మ, పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు బిఎల్ఓ విధుల నుండి మినహాయింపు ఇవ్వాలి

- ఏఐటియూసి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** బిఎల్ఓ విధుల నుండి అంగన్వాడీలకు మినహాయింపు ఇవ్వాలని ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ అన్నారు. సోమవారం ఈ మేరకు ఏఐటియూసి ఆధ్వర్యంలో అంగన్వాడీల సమస్యలపై అదనపు కలెక్టర్ వేణుగోపాలరావుకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో 50 శాతానికి పైగా అంగన్వాడీల్లో గత కొన్నేళ్లుగా సహాయకులు లేరన్నారు. దీంతో టీచర్లే బోధనతో పాటు కేంద్రాల నిర్వహణ పనులు కూడా ఒంటరిగా చూడాల్సి వస్తోందన్నారు. ఇంలాటి పరిస్థితుల్లో అదనంగా ఓటర్ల జాబితా సవరణ వంటి బిఎల్ఓ విధులు అప్పగించడం వల్ల కేంద్రాలు మూతపడే పరిస్థితి ఉందన్నారు. దీంతో బాలింతలు, చిన్నపిల్లలకు అందాల్సిన పౌష్టికాహారం పంపిణీతో పాటు ప్రీ స్కూల్ బోధన పూర్తిగా కుంటుపడుతోందని వారు తెలిపారు. ప్రభుత్వంలో పంచాయితీరాజ్ ఉపాధి హామీ విద్యాశాఖ వంటి ఇతర శాఖల సిబ్బంది అందుబాట్లో ఉన్నప్పటికీ కేవలం అంగన్వాడీలపైనే ఈ అదనపుభారం మోపడం సరికాదన్నారు. కనీస సౌకర్యాలు, బిఎల్ఓ విధులకు సంబంధించి ఎలాంటి అలవెన్సులు లేకుండా, ఆన్‌లైన్ పనుల కోసం కనీసం ట్యాబ్‌ల సదుపాయం,సరైన మొబైళ్లను సమకూర్చడం కూడా లేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులు, ఎన్నికల సంఘం వారు తక్షణమే స్పందించి బిఎల్ఓ విధుల నుండి అంగన్వాడీ టీచర్లను మినహాయించాలని, లేదంటే మాతా శిశు సంరక్షణ వ్యవస్థ పూర్తిగా దెబ్బదింటుందన్నారు. ఈ కార్యక్రమంలో వినోద, లక్ష్మి , మంగ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవచూపాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవచూపి సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం ఐడిఓసిలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన జిల్లా నలు మూలల నుండి తరలవచ్చిన ప్రజల వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఆ వినతులను సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులపై నమ్మకంతో తమ సమస్యలు తీరుతాయనే ఉద్దేశ్యంతో ఇక్కడి వరకు వచ్చిన ఫిర్యాదులు చేస్తుంటారని, వాటిని పరిష్కరించాల్సిన అధికారులు ఆ దిశగా కృషి చేయాలని చెప్పారు. ప్రభుత్వం ద్వారా అమలయ్యే సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలని సూచించారు. వచ్చిన ప్రతీ దరఖాస్తుని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని, పరిష్కారానికి నోచుకోని వాటిపై తగిన నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.



**ఐటిడిఏలో గిరిజన దర్బార్ :** భద్రాచలం ఐటిడిఏలో గిరిజన దర్బారును నిర్వహించారు. ఈ సందర్భంగా పిఓ రాహుల్ ఐటిడిఏ పరిధిలోని మండలాల నుండి తరలొచ్చిన గిరిజనుల నుండి వినతులు స్వీకరించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ దశలవారీగా ప్రభుత్వ పథకాలు దరిచేరతాయని చెప్పారు. అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంలో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వానా కాలం సీజన్ ప్రారంభమైనందున గిరిజన గ్రామాల్లో అపరిశుభ్ర పరిసరాలు లేకుండా అవగాహన కల్పించాలని, విష జ్వరాల భారినపడే ప్రమాదం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ యూనిట్ల అధికారులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల పరిధిలోని సూరారం గ్రామానికి చెందిన సిద్ది బోయిన చిన్న పుల్లారావు అనే రైతు కు చెందిన దుక్కిటెద్దు మృతి చెందింది. ప్రతి రోజు లాగానే శుక్రవారం సమీప పొలాలకు మేతకు వెళ్ళింది. వ్యవసాయ భూములకు రైతులకు అవసరం నిమిత్తం ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్ ఫార్మర్ అతి తక్కువ ఎత్తులో ఉండంతో దురదృష్టవశాత్తు విద్యుత్ ఘతానికి గురై మేత కు వచ్చిన దుక్కిటెద్దు అక్కడికక్కడే మృతి చెందింది. సోమవారం ఉదయం రైతు సిద్దిబోయిని చిన్న పుల్లారావు తన దుక్కిటెద్దు కోసం వెతికాడు. అది ట్రాన్స్ఫార్మర్ వద్ద విద్యుత్ ఘాతుకం గురై అక్కడికక్కడే మృతి చెందింది. వర్షాకాలం నెత్తిమీదికి రావడంతో, ఇప్పుడే దుక్కిటెద్దు మృతి చెందడంతో ఆదివాసి రైతు బోరున విలపించాడు. ఈ దుక్కిటెద్దు సుమారు రూ. 80 వేలు విలువచేస్తుంది. ఈ నిరుపేద ఆదివాసి గిరిజన రైతుకు ఆర్థిక సాయం అందించి తన వ్యవసాయానికి తోడ్పడాలని అధికారులను వేడుకుంటున్నాడు.

# ఆ వరి వంగడాన్ని అరికట్టేది ఎలా..?

- కేఎన్ఎం 12510 రకంపై పలు అనుమానాలు
- పరిశోధన కాకముందే మార్కెట్లోకి
- గత ఏడాది నష్టపోయిన రైతులు
- తిరస్కరించిన మిల్లర్లు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పరిశోధన సాగుతుండగానే ఓ వరి వంగడం మార్కెట్టికి రావడం, దానిని గత ఏడాది రైతులు సాగు చేయడం, దానిపై భిన్న స్వరాలు వినబడటం జరిగింది. అయితే ఈ రకం ఇప్పుడు కూడా మార్కెట్లోకి ప్రత్యక్షమయ్యే ప్రమాదం ఉందని కొందరు రైతులు భావిస్తుండగా, దీనిని అరికట్టాలని మరి కొందరు అంటున్నారు. ఇంకొందరైతే ప్రభుత్వం మద్దతు ధర కోసం ప్రకటించిన ఏడు వరి వంగడాల్లో ఈ రకం లేదని, దీనిని సాగు చేసే అవకాశం ఈసారి తక్కువని చెబుతున్నారు.

**గత ఏడాది పరిశోధన స్థాయిలోనే :** గత ఏడాది పరిశోధన స్థాయిలో ఉన్న కేఎన్ఎం 12510 రకం అసలు మార్కెట్లోకి ఎలా వచ్చిందో కూడా తెలియని పరిస్థితి. జిల్లాలో ఈ రకం విత్తనాలు కొందరు ఉపయోగించగా వారిలో దిగుబడి బాగా వచ్చిన వారు, దిగుబాటి ఆశించిన స్థాయిలో రాని వారు సైతం ఉన్నారు. ఈ విత్తనాలు మార్కెట్లోకి రావడం పట్ల అప్పట్లో పెద్ద దుమారమే రేగింది. నష్టపోయిన రైతులు ప్రభుత్వం దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. దిగుబడి తగ్గడం నాణ్యతా సమస్యలు తలెత్తడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సైతం వీటిని తిరస్కరించినట్లు తెలిసింది. అయితే పెద్దపల్లి పరిశోధనా కేంద్రంలో కేఎన్ఎం 12510 రకం బయటకు విడుదలయ్యే అవకాశం లేదని, ఈ విత్తనాన్ని పోలిన విత్తనాలు వచ్చి ఉంటాయని శాస్త్రవేత్తలు అంటున్నారు . ఈ మధ్య కాలంలో జిల్లా సమావేశంలో కలెక్టర్లు సైతం ఈ విషయాన్ని ప్రస్తావించడం గమనార్హం.

**మిల్లర్లు తిరస్కరించారు :** కేఎన్ఎం 12510 వరి వంగడాన్ని సాగు చేసి మిల్లర్లకు పంపగా వాటిని చాలా మంది మిల్లర్లు తిరస్కరించారు. ఎంతో కొంత తగ్గించి కొనుగోలు చేయాలని రైతులు కోరడంతో క్వింటాకు రూ.400 నుండి రూ.500 వరకు తగ్గించిన కొన్నారనే వాదన ఉంది. మిల్లర్లు ఈ బియ్యంతో అన్న వండి చూడగా, రూచిగా లేకపోవడంతో పాటు రంగుమారినట్లు తెలిసింది. వండిన తర్వాత కూడా త్వరగా నాణ్యత కోల్పోయే దశకు వచ్చినట్లు తెలిసింది. ఊరు పేరు లేని విత్తనాలు కొనుగోలు చేయరాదని, తద్వార దిగుబడి రాక నష్టపోయారని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

**ప్రభుత్వం బోనస్ ఇచ్చే విత్తనాలు ఇవే :** రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చేందుకు ఏడు రకాల వరి వంగడాలను ఎంపిక చేసింది. వాటిని సాగు చేస్తేనే రైతులకు బోనస్ అందుతుంది. బిపిటి5204 సాంబామసూరి, ఆర్ఎన్ఆర్ 15048 తెలంగా సోన, హెచ్ఎంటి సోన, జై శ్రీరాం, కేఎన్ఎం1638, డబ్ల్యూజిఎల్ 44, జెఎన్ఎం7714 వరి వంగడాలు మాత్రమే సాగు చేయాలని, వాటికి మాత్రమే మద్దతు ధర లభిస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులు దీనిని గమనించిన ప్రభుత్వ నిబంధనల ప్రకారం సాగు చేయాలని సూచిస్తున్నారు.

# పంచాయతీ భవనం పూర్తయ్యేనా..!

-అర్ధాంతరంగా నిలిచిన నిర్మాణం
-పర్యవేక్షణలేని అధికార యంత్రాంగం



**ప్రజాపక్షం/పినపాక :** గ్రామీణాభివృద్ధిలో భాగంగా నిర్మిస్తున్న పాతరెడ్డిపాలెం గ్రామ పంచాయితీ భవన నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ భవన నిర్మాణం పిల్లర్ల దశలోనే ఆగిపోవడంతో నెలల తరబడి పనులు ముందుకు సాగడం లేదు. గ్రామ పంచాయితీకి సొంత భవనం ఉండాలనే లక్ష్యంతో నిర్మాణం చేపట్టినప్పటికీ, నిధుల కొరత, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా కాంట్రాక్టర్లు పనులను నిలిపివేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం నిర్మాణ స్థలం పిచ్చిమొక్కలు, పొదలతో నిండిపోయి నిరుపయోగంగా మారింది. కొత్త గ్రామ పంచాయితీ ఏర్పాటైనప్పటి నుంచి తాత్కాలిక భవనాలోనే పాలన కొనసాగుతుండటంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు తగిన పర్యవేక్షణ చేయకపోవడం వల్లే పనులు నిలిచిపోయాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అవసరమైన నిధులు విడుదల చేసి, నిలిచిపోయిన గ్రామ పంచాయితీ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. గ్రామానికి సొంత పంచాయితీ కార్యాలయం అందుబాటులోకి వస్తే పరిపాలనా సేవలు మరింత సమర్థవంతంగా అందుతాయని వారు అభిప్రాయపడుతున్నారు.

## రైతు మేళాలను సద్వినియోగం చేసుకోండి

**ప్రజాపక్షం/కరకగూడెం:** ప్రభుత్వ నిర్ణయం మేరకు నేటి నుండి 30వ తేదీ వరకు జిల్లాలోని అన్ని రైతువేదికలలో విత్తన మేళా నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ మేళాలో ప్రభుత్వం సూచించిన 7 సన్న రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉంటాయని, రైతులు తమకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను ఒకే చోట కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించబడిందని తెలిపారు. రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విత్తన మేళాలో పాల్గొని తమకు కావలసిన విత్తనాలను కొనుగోలు చేసుకోవలసిందిగా కోరారు. కరకగూడెం లో ఉన్న అనంతారం, బట్టుపల్లి రైతు వేదికల నందు విత్తన మేళ నిర్వహించబడునట్లు తెలిపారు. కావున రైతులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** రైతులకు ఇబ్బంది కరంగా ఉన్న యూరియా యాప్ ను తక్షణమే రద్దుచేసి, పాత పద్ధతిలో రైతులకు యూరియా అందజేయాలని డిమాండ్ చేస్తూ జూలూరుపాడు తహశీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాస రోశయ్య సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుతం సాగు ప్రారంభమైన తరుణంలో అటు కేంద్ర ప్రభుత్వం ఇటు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరి వల్ల సాగుచేయడం భారమై రైతాంగం తీవ్ర సంక్షోభంలో కూరుకు పోయారని,పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయిన తరుణంలో పండిన పంటలకు సరైన గిట్టు బాటు ధరలు లేక రైతాంగం దిక్కుతోచలేని పరిస్థితిలో కొట్టు మిట్టాడుతున్నారని కేంద్ర ప్రభుత్వం అడ్డగోలుగా పెంచిన ఎరువుల ధరలను, డీజిల్ మరియు పెట్రోల్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పంట రుణమాఫీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, రైతు సంఘం నాయకులు యల్లంకి మధు, ఎస్.కె నాగుల్ మీరా, సిరిపురపు వెంకటేశ్వర్లు, తూము కోటయ్య, పొనేకంటి వెంకటేశ్వర్లు, ఊడల సుధా, చెరుకుమల్ల రాజేశ్వరరావు, ఎస్.కె చాంద్ పాషా, చీమకుర్తి సంతోష్, పసుపులేటి పవన్, చీమకుర్తి భాస్కర్, వెంకటేశ్వర్లు, సురేష్, గోపి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల ధరలు తగ్గించాలి

-మాజీ వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** పెంచిన విత్తనాలు, ఎరువులు, డీజిల్, పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, మాజీ వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ఆళ్లపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మెమోరాండం సమర్పించారు. ఈసందర్భంగా మండల కార్యదర్శి కొమరం హనుమంతరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రేసు ఎల్లయ్య మాట్లాడుతూ ఎరువుల ధరలు భారీగా పెరగడంతో రైతులపై అదనపు భారం పండిందన్నారు. నకిలీ విత్తనాలు, పురుగుమందులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని, రైతు భరోసాను ఒకే సారి జమ చేయాలని, పంట రుణమాఫీ అమలు చేయాలని, పంటల భీమా పథకాన్ని తీసుకురావాలని, ధాన్యానికి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎస్కే రహీం, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంటా సహదేవ్, సురేందర్, ఆరెం రామకృష్ణ, శ్రీరామ్ హరీష్, కసనబోయిన నరేష్, సాగర్ నారాయణ, వెల్లిపోయిన నవీన్, రెడ్డిమల్ల సమ్మయ్య, పూణెం వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల అభివృద్దే లక్ష్యం

-మండల అభివృద్ధికి ఎంఎల్ఏ జారే శ్రీకారం



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండల ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎంఎల్ఏ జారే ఆదినారాయణ అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన రూ 1.86కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా తొట్టిపంపు గ్రామ పంచాయితీలో రూ 16లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం, అన్నపురెడ్డిపల్లిలో గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో రూ 25లక్షలతో డైనింగ్ హాల్ నిర్మాణం, వెంకటాపురం గ్రామంలోని పాఠశాలకు రూ 10లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణం, రాజాపురంలో రూ 1.35కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లాకావుతు లక్ష్మి, తహసీల్దార్ స్వర్ణ, పంచాయితీ రాజ్ శాఖ ఏఈ శ్రీనివాస్, ఉప సర్పంచ్ మారగాని అశోక్, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ చైతన్య, మండల అధ్యక్షుడు పరసా వెంకటేశ్వర్లు, భానోత్ భీముడు, లక్ష్మారెడ్డి, నాగేశ్వరరావు, దుబ్బాకల రాము, రామిరెడ్డి, వెంకట్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీఐ ఎల్లయ్యకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ ఎల్లయ్యను అశ్వాపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా అశ్వాపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వెలమ రాజేందర్ మాట్లాడుతూ అశ్వాపురం మండలానికి నూతనంగా వచ్చేసిన సీఐ ఎల్లయ్యకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఐ ఎల్లయ్య మాట్లాడుతూ అశ్వాపురం ప్రెస్ క్లబ్ సభ్యులు అందించిన ఆత్మీయ స్వాగతానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు ములకలపల్లి గోపీనాథ్, రాధా కృష్ణ, లెనిన్, శ్రీధర్, సుధీర్, కోటి, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రసాద్‌కు తాటి నివాళి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన వెదుళ్లపల్లి నాగబాబు అల్లుడు చరుగొర్ల ప్రసాద్ గుండెపోటుతో మృతి చెందగా, ఆయన నివాసానికి వెళ్లిన అశ్వారావుపేట మాజీ ఎంఎల్ఏ, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి ధైర్యం చెప్పారు. ఈకార్యక్రమంలో జగన్నాథపురం సర్పంచ్ కుంజా వినోద్, మాజీ సర్పంచ్ బైటి రాజేష్, నాయకులు యినుగంటి రాము, పామర్తి కృష్ణ, కోరంపల్లి చెన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

## డిడిఆర్ఎఫ్ శిక్షణ పర్యవేక్షణ

**ప్రజాపక్షం/మణుగూరు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ఆదేశాల మేరకు అశ్వాపురం మండలం తుమ్మల చెరువు వద్ద జరుగుతున్న డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిడిఆర్ఎఫ్) శిక్షణ కార్యక్రమాన్ని మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి సోమవారం సందర్శించారు. శిక్షణా శిబిరాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి అందుతున్న శిక్షణ తీరును పర్యవేక్షించారు. విపత్తుల సమయంలో ప్రజలను రక్షించడంలో, అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడంలో డిడిఆర్ఎఫ్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో అశ్వాపురం సిఐ ఎల్లయ్య, మరియ పోలీస్ అధికారులు, డిడిఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులపై భారం మోపుతున్న మోడీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

**ప్రజాపక్షం/వైరా:** పెట్రోల్, డీజిల్ ఎరువులు ధరలు పెంచి రైతులపై భారం మోపి పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రజలు మోడీ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ తెలిపారు. సోమవారం తెలంగాణ రైతు సంఘం వైరా మండల సమితి ఆధ్వర్యంలో వైరా తహాశబుల్దార్ కార్యాలయం వద్ద జరిగిన రైతుల ధర్నాలు పాల్గొని ప్రసంగించారు. అనంతరం తహాశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సాగు చేస్తున్న రైతులకు ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయే రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం పంటల భీమా పథకాన్ని ఏర్పాటు చేయాలని, ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల పైనున్న పంట రుణమాఫి చేస్తానని ఇచ్చిన హామీలు అమలు చేయాలని, అన్ని రకాల పంటలను ప్రభుత్వాలు కొనుగోలు చేయాలని , 55 సంవత్సరాలు ఉన్న రైతులందరికి రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలని, రైతు కుటుంబానికి రూ.10లక్షల వరకు ఆరోగ్య భద్రత కార్డు ఇవ్వాలని నకిలీ విత్తనాల అక్రమ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకొని



నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, రైతులకు సంపూర్ణంగా అందించాలని రైతు భరోసా పంట సాగు మొత్తానికి ఒకేసారి పెట్టుబడి సాయం ఇచ్చే లాగా ముఖ్యమంత్రి 30వ తారీఖు సభ ఉండాలని వారు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు, రైతు సంఘం మండల కార్యదర్శి కొండా రామకృష్ణ, రైతు సంఘం నాయకులు బండారుపల్లి ముత్తయ్య, మూట కొండ, నాగేశ్వరరావు, డేరంగుల లక్ష్మయ్య, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# కిష్టారం శివార్లలో కత్తులతో దాడి

**-ఇద్దరు గ్రామస్థులకు తీవ్ర గాయాలు**
**-భార్యాభర్తలు పరారీ**
**-కేసు నమోదు చేసిన పోలీసులు**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామ శివార్లలో కొబ్బరి బోండాలు కొట్టే కత్తులతో దాడి చేసి ఇద్దరిని తీవ్రంగా గాయపరిచిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఇది తప్పు,ఆపమన్నందుకు ఇలా ప్రాణాలు తీయ్యటానికి సిద్ధమయ్యారంటే సమాజం ఎటుపోతుందే అర్థం కావటం లేదని గ్రామస్తులు తలలు పట్టుకుంటున్నారు. బంధువులు, పోలీసుల తెలిపిన కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరువూరు మండలానికి చెందిన నాగమణి, హనుమంతరావు దంపతులు కిష్టారం గ్రామ సమీపంలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై కిష్టారం ఎస్సీ కాలనీకి చెందిన గ్రామ పెద్దలు మారోజు నాగేశ్వరరావు, నక్క వెంకటేశ్వరరావు వారిని కలిసి గ్రామ సమీపంలో ఇటువంటి కార్యకలాపాలు నిర్వహించడం సరికాదని, అక్కడి నుంచి వెళ్లిపోవాలని హెచ్చరించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, అది తీవ్ర స్థాయికి చేరి నాగమణి, హనుమంతరావు దంపతులు కొబ్బరి బోండాలు కొట్టే కత్తులతో దాడికి దిగినట్లు తెలిపారు. ఈ ఘటనలో మారోజు నాగేశ్వరరావు, నక్క వెంకటేశ్వరరావులకు తీవ్ర గాయాలయ్యాయి. తక్షణమే పక్కనున్న వారు 108కి సమాచారం అందించగా, అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి చికిత్స అందించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిపారు. ఘటన అనంతరం నాగమణి, హనుమంతరావు పరారీలోకి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఈ వ్యవహారానికి సంబంధించి కొత్తగూడెంకు చెందిన సోని అనే మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. గ్రామ శివారుల్లో వ్యభిచార గృహాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వెలువడటం, వాటిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడం, అనంతరం హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇటువంటి ఆరోపణలపై సంబంధిత శాఖలు ముందస్తుగా నిఘా పెట్టి చర్యలు తీసుకుంటే ఇలాంటి ఘటనలు నివారించవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఈ ఘటనపై వి.ఎం. బంజర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# ఎన్యూమరేషన్ ఫారంలో ఓటర్ వివరాలు తెలపాల్సిందే..

**ప్రజాపక్షం/పెనుబల్లి:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ప్రత్యేక సమగ్ర సవరణ)లో భాగంగా ఈనెల 25 నుండి జూలై 24 వరకు బిఎల్వోలు ప్రతి ఇంటికి వచ్చి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారం అందిస్తారని అట్టి ఫారం నింపి బిఎల్ఓ లకు అందించి మ్యాపింగ్ చేయించాలని తహాశీల్దార్ వీరభద్ర నాయక్ అన్నారు. సోమవారం పెనుబల్లిలోని కళ్యాణ మండపంలో జరిగిన బిఎల్వోలు, రాజకీయ నాయకులు పోలింగ్ ఏజెంట్లతో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1987 కంటే ముందుగా జన్మిస్తే మ్యాఫింగ్ కాకపోతే ఓటరు కుల ధ్రువీకరణ పత్రం తీసుకొని బిఎల్ఓ లకు అందించాలని తద్వారా సబ్ కలెక్టర్ ని కలిసి ఓటరు ఫోటో దిగాల్సి ఉంటుందని అన్నారు. 1987 నుండి 2004లోపు జన్మిస్తే ఓటరు తల్లి, తండ్రి కలసి కుల దృవీకరణ పత్రం పొంది, బిఎల్ఓ అందించాలని అలాగే 2004 నుండి తర్వాత జన్మిస్తే ఓటరు, తల్లి, దండ్రులు కుల ధ్రువీకరణ పత్రంతో బిఎల్ఓ వద్ద ఎన్యూమరేషన్ ఫారం నింపాలని వివరించారు. ఓటరు 2002 లో ఇతర ప్రాంతంలో ఓటు నమోదు అయి ఉంటే ఇప్పుడు మీరు ఉన్న ప్రాంతంలో ఓటు నమోదు ఉంటే రెండు ఓటర్ల జాబితాను సవరణ చేసి మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందని. లేనియెడల ఓటర్ నుండి తొలగిస్తారని ఆయన వివరించారు. ఓటర్లు అపోహాలు అనుమానాలకు తావు లేకుండా ప్రతి బిఎల్ఓ ఇంటి వద్దకే వచ్చి ఎన్యూమరేషన్ ఫారం ఇచ్చి మీ వద్ద ఉన్న సమాచారం తీసుకొని అట్టి ఫారం నింపి ఒక ఫారం బిఎల్ఓ తీసుకొని మరొక ఫారాన్ని ఓటర్‌కు ఇస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ బిఎల్ఓ లను రాజకీయ పార్టీలకు చెందిన బిఎల్ఓ లను సంప్రదించాలని మీ ఇంటికి బిఎల్వోలు రాని ఎడల రెవెన్యూ కార్యాలయంలో సమాచారం అందిస్తే అట్టి ఇంటికి బిఎల్వోలు వచ్చి ఎన్యూమరేషన్ చేసి ఫారాన్ని తీసుకుంటారని తెలిపారు. నెలరోజులు పాటు జరిగే ఎన్యూమరేషన్ కార్యక్రమంలో ప్రతి ఒక్క ఓటరు జాగ్రత్తగా పరిశీలించి నమోదు చేయించుకోవాలని ఆయన వివరించారు. ఎన్యూమరేషన్ విషయం లో ప్రజలకు సందేహాలు ఉంటే తహాశీల్దార్ కార్యాలయం లో ఉద్యోగులను సంప్రదించ వలసినదిగా తహాశీల్దార్ తెలిపారు.

# మంట కలిసిన మానవత్వం..!

**- మృతదేహాలను ఇంటికి రానివ్వని ఇంటి యజమాని**
**- ఎటు పోతోంది ఈ సమాజం**





**ప్రజాపక్షం/భద్రాచలం :** మానవత్వం మంట కలిపోతోంది. ప్రాణం లేని శవం కంటే ప్రాణం ఉన్న మనిషే ప్రమాద కరమని రుజువు చేశాడు ఓ ఇంటి యజమాని. ఒకే కుటుంబానికి చెందిన భార్య,భర్త, కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడగా, చిటికెడంత సానుభూతి చూపకపోగా మృతదేహాలు ఇంటికొస్తే అరిష్టం అనే మూఢ నమ్మకంతో ఇంటికి తాళం వేసుకుని మూర్ఖత్వాన్ని ప్రదర్శించాడు. చివరికి చేసేది లేక మృతురాలి తండ్రి అల్లుడు, మనుమడు, కుమార్తె మృతదేహాలను పురుషోత్తపట్నంలోని వారి ఇంటికి తీసుకెళ్లి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఎంత మంది బ్రతిమాలినా తాను నమ్మిన గుడ్డి నమ్మకాల కోసం కనీసం శవాలపై అయినా కనికరం చూపలేని ఆ ఇంటి యజమానిపై సభ్య సమాజంతో దుమ్మెత్తిపోస్తోంది. ఈ ఘటనలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు రాలు కెచ్చల కల్పన ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాచలం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన ఒకే కుటుంబానికి చెందిన సాయి, అతని భార్య, సంధ్య, కుమారుడు మోక్షిత్ కారు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో సాయి తల్లి జ్యోతి తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్సలు పొందుతోంది. ఇదిలా ఉండగ సాయి తండ్రి శ్రీనివాస్ విద్యుత్ శాఖలో పనిచేస్తూ గత ఐదు నెలల క్రితం మృత్యువాత పడ్డారు. తండ్రి ఉద్యోగంలో మృతుడు సాయి ఈనెలాఖరుకు విధుల్లో చేరాల్సి ఉంది. వరుస ఘటనలు ఆ కుటుంబాన్ని తీవ్ర విషాదంలో నింపింది. ఈ ఘటనలో స్థానిక ప్రజల హృదయాలను బరువెక్కించింది.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి




**ప్రజాపక్షం/వైరా:** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో డిమాండ్ చేశారు. డిహెచ్‌పిఎస్ జిల్లా కౌన్సిల్ సమావేశం వైరా పట్టణంలోని రజబ్ అలీ భవనం నందు జిల్లా అధ్యక్షులు పగిడిపల్లి ఏసు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1950లో వెలువడిన రాష్ట్రపతి ఉత్తర్వులు దళిత హక్కులను కాళరాస్తున్నాయని, అవి రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 15,25లకు పూర్తిగా వ్యతిరేకమని ఆయన విమర్శించారు. ఈ ఉత్తర్వులు దళిత క్రైస్తవుల మెడపై కత్తిలా వేలాడుతున్నాయని వాటిని తక్షణమే రద్దు చేసి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పింఆచలని ఆయన డిమాండ్ చేశారు. అంబేద్కర్ స్ఫూర్తితో డిహెచ్‌పిఎస్ ఈ పోరాటంలో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో డిఎస్‌పిఎస్ రాష్ట్ర సమితి సభ్యులు యామాల గోపాలరావు, జిల్లా డిహెచ్‌పిఎస్ కార్యదర్శి వెంగళ ఆనందరావు, తడికమళ్ళ ఏబు, కోటా నాగేశ్వరరావు, జిల్లా లింగయ్య, నారపోగు వసంతరావు, కాకాటి కరుణాకర్, సిల్లిముంత మధు, రాయపూడి శ్రీనివాసరావు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి మూట కొండ, గారపాటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యల పరిష్కారానికి ఏఐకెఎస్ వినతి



**ప్రజాపక్షం/బోనకల్:** తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం(ఏఐకెఎస్) మండల కౌన్సిల్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సిహెచ్ సుధాకర్‌కు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినితి పత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు మాట్లాడుతూ రైతులకు సకాలంలో రైతు భరోసా నిధులు విడుదల చేయడం, యూరియా యాప్‌ను రద్దు చేయడం, పంట రుణమాఫీ అమలు, సమగ్ర పంటల భీమా పథకం ప్రవేశపెట్టడం, నకిలీ విత్తనాలు, పురుగు మందుల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పై సమస్యలతో కూడిన వినతి పత్రాని తహసీల్దార్‌కు అందజేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చావా గోపాలకృష్ణ, గుడిద నాగేశ్వరరావు, జి కృష్ణారావు, సిపిఐ నాయకులు గుంపుల జయరాజు పాల్గొన్నారు.

# పోడు భూములకు తక్షణమే పట్టాలివ్వాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని చెరుకుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కోయ గిరిజన కుటుంబాలు సాగు చేస్తున్న పోడు భూములను వెంటనే సర్వే చేసి పట్టాలు మంజూరు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. సోమవారం గిరిజనులతో కలిసి నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్23లో సుమారు 125 ఎకరాల భూమిని కోయ గిరిజన కుటుంబాలు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నప్పటికీ, అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం వన సంరక్షణ పేరుతో మొక్కలు నాటి వ్యవసాయ కార్యకలాపాలను అడ్డుకుందని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా భూములను సర్వే చేయాలని మంత్రి ఆదేశించి నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు. పోడు పోరాటదారుల సంఘం కన్వీనర్ తాటి వీరభద్రం మాట్లాడుతూ, గిరిజనులు తమ భూములపైకి వెళ్లేందుకు ప్రయత్నించగా అటవీ శాఖ అధికారులు అడ్డుకొని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తక్షణం జోక్యం చేసుకొని పోడు భూముల సర్వే నిర్వహించి అర్హులైన గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాటి వీరభద్రం, తాటి రాజులు, గడ్డం కృష్ణయ్య, గడ్డం రాజులు, గడ్డం తిరుపతమ్మ, తాటి కుమారి, తాటి రాజమ్మ, తాటి రత్తమ్మ, చిన్న వీరభద్రం తదితరులతో పాటు 50 మందికి పైగా గిరిజనులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/అశ్వారావుపేట:** రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర సమితీ సభ్యుడు సయ్యద్ సలీం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ మండల సమితి, రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించి మాట్లాడారు. పెంచిన ఎరువుల ధరలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతు బంధును ఒకే దఫాలో ఈనెలాఖరుకల్లా రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. యూరియా యాప్‌ను రద్దు చేయాలని, నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై పీడీయాక్టు నమోదు చేసి శిక్షించాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని, అర్హులైన పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు, మౌళిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యుడు గన్నిన రామకృష్ణ, పట్టణ కార్యదర్శి నూకవరపు విజయ్‌కాంత్, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు రైతులకు విత్తనమేళా

**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:** ప్రభుత్వ నిర్ణయం మేరకు నేడు మండలంలోని అన్ని రైతు వేదికలలో విత్తన మేళ నిర్వహిస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సాయిశివ పేర్కొన్నారు. ప్రభుత్వం సూచించిన 7సన్న రకాల వరి విత్తనాలు ప్రైవేట్ డీలర్లు, సహకార సంఘాలు అందుబాటులో ఉంటాయని, నాణ్యమైన విత్తనాలు ఒకే చోట కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు.

# విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:** విద్యార్థులు మాధకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై రమేశ్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మాధకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. మాధకద్రవ్యాల వల్ల వచ్చే దుష్పరిణామాలు, చట్టపరమైన చర్యలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ప్రధానోపాధ్యాయుడు రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రస్తుత సంక్షోభ కాలంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకం





- పోరాట స్ఫూర్తిని రగిలించింది ఎఐటియుసి
-ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతుల్లో కూనంనేని





ప్రజాపక్షం/మంచుపల్లి: కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేయడమే కర్తవ్యమని, ప్రస్తుత సంక్షోభ కాలంలో కమ్యూనిస్టుల పాత్ర మరింత కీలకమని ఎఐటియూసీ గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియూసీ) ఆధ్వర్యంలో గౌతంపూర్ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం నిర్వహించిన ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతులు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎఐటియూసీ గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.షాబీర్ పాషా హాజరై కార్మిక ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్లు, ట్రేడ్ యూనియన్‌ల బాధ్యతలు, కార్మిక హక్కుల పరిరక్షణ అంశాలపై ప్రసంగించారు. శిక్షణ తరగతుల్లో రాష్ట్ర ఎఐటియూసీ నాయకులు సింగు నర్సింహారావు చారిత్రక భౌతికవాదం అంశంపై సమగ్రంగా వివరించారు. అనంతరం వి.మల్లికార్జునరావు లేబర్ కోడ్స్‌పై అవగాహన కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ వల్ల కార్మికులపై పడే ప్రభావాన్ని వివరించారు. మధ్యాహ్నం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వర్తమాన పరిస్థితుల్లో కమ్యూనిస్టుల పాత్ర అనే అంశంపై మాట్లాడారు. ప్రస్తుత రాజకీయ, సమాజిక, ఆర్థిక పరిస్థితుల్లో కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాల్సిన అవసరముందని ఆయన చెప్పారు. అనంతరం ఎస్‌కె. సాబీర్ పాషా కులం, వర్గం, వర్గపోరాటాలు, సామాజిక న్యాయం అంశంపై ప్రసంగిస్తూ సామాజిక న్యాయం సాధనలో వామపక్ష ఉద్యమాల పాత్రను వివరించారు. కొరిమి రాజ్‌కుమార్ ప్రసంగిస్తూ ప్రస్తుత పరిస్థితుల్లో కార్మిక వర్గం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది, ఉద్యోగ భద్రత, వేతనాలు, సంక్షేమ సౌకర్యాలు, కార్మిక చట్టాల అమలు వంటి అంశాలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావడం, అవసరమైతే పోరాటాలు నిర్వహించడం ట్రేడ్ యూనియన్ల ప్రధాన బాధ్యత అని వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, సత్తుపల్లి కార్యదర్శి సముద్రాల సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ క్రిస్టోఫర్, సహాయ కార్యదర్శి గట్టయ్య, సూర్య ప్రకాష్, ఆఫీస్ బ్యారర్స్ సందబోయిన శ్రీనివాస్, ఎస్.నాగేశ్వరరావు, హుమాయూన్, హీరాలాల్, గుమ్మడి వీరయ్య, పిట్ కార్యదర్శులు భూక్యా రమేష్, ఎంఆర్‌కే ప్రసాద్, మధుకృష్ణ, కమల్, కిషోర్, చారి, భీమయ్య, అప్పారావు, బండారి, మల్లయ్య, మండల రాజేశ్వరరావు, సందీప్ పాల్గొన్నారు.

# కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఐడిఓసిలో అదనపు కలెక్టర్ వేణుగోపాలరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సం. ప్రారంభమైనందున పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించి తక్షణమే పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు విద్యార్థులకు అందించాలన్నారు. జిల్లాలో విచ్చలవిడిగా వెలిసిన కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల్లో అధిక ఫీజులు వసూళ్లు చేయడమే కాకుండా విద్యార్థులకు అవసరమైన స్టేషనరీ మొత్తం తమ వద్దే కొనుగోలు చేయాలని విద్యార్థులపై ఒత్తిడి తేవడం సరైంది కాదన్నారు. తక్షణమే అమ్మకాలపై విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని, లేదంటే విద్యార్థి సంఘం నుండి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుల ఎస్‌క షాహీద్, సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షులు కొరిమి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## విత్తన మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపక్షం/పొల్వంచ : రైతులు విత్తనమేళాను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి. శంభోశంకర్ అన్నారు. సోమవారం ప్రజాపక్షంతో మాట్లాడుతూ రైతు వేదికల్లో నేటి నుండి వారం రోజుల పాటుగా విత్తన మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన బోనస్ వరి విత్తనాలతో పాటు కంది, పెసర, కూరగాయల విత్తనాలు, నానో యూరియా, నానో డిఏపి అందుబాటులో ఉంటాయని చెప్పారు. కావునా రైతులు విత్తన మేళాను సద్వినియోగం చేసుకొని కావలసిన విత్తనాలను తీసుకోవాలని సూచించారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని రైతుమేళాను విజయవంతం చేయాలని కోరారు.

## మెనూ ప్రకారమే ఆహారం అందించాలి

ప్రజాపక్షం/ఎర్రుపాలెం: గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఆహారం మెనూ ప్రకారం అందించాలని ఎంపీఓ టి.కృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని గురుకుల బాలికల పాఠశాలను సోమవారం ఎంపీఓ ఆకస్మికంగా సందర్శించి, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పరమేశ్వరి, గ్రామ కార్యదర్శి ఏలేశ్వరరావు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# శ్మశానవాటికలోనే చెత్త డంపింగ్..!

-చెత్తకుప్పల మధ్య అంత్యక్రియలు
-పోకలగూడెం పంచాయితీ తీరుపై తీవ్ర విమర్శలు



ప్రజాపక్షం/చంద్రుగొండ: మనిషి జీవితానికి చివరి మజిలీ అయిన శ్మశాన వాటిక, ప్రశాంతత, పరిశుభ్రతకు ప్రతీకగా ఉండాల్సిన ఆ ప్రదేశం ఇప్పుడు చెత్త కుప్పలకు నిలయంగా మారింది. చంద్రుగొండ మండలం పోకలగూడెం గ్రామ పంచాయితీ పరిధిలోని శ్మశానవాటిక ప్రస్తుతం డంపింగ్ యార్డును తలపిస్తుండటంతో గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సేకరించి చెత్తను గత ఏడాదిన్నర కాలంగా ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చి నేరుగా శ్మశాన వాటికలోనే వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, కుళ్లిపోయిన చెత్త, గృహ వ్యర్థాలతో శ్మశానవాటిక మొత్తం నిండిపోవడంతో అక్కడ తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో అంత్యక్రియల కోసం వచ్చే కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మృతులకు చివరి వీడ్కోలు పలకాల్సిన ప్రదేశంలో చెత్త దుర్వాసన మధ్య నలబడాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖననాలు, అంత్యక్రియలు నిర్వహించేందుకు కూడా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడటంతో కొందరు తమ సొంత స్థలాల్లోనే ఖననాలు నిర్వహించుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు పంచాయితీ కార్యదర్శి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రజల భావోద్వేగాలతో ముడిపడిన శ్మశానవాటికను చెత్త నిల్వ కేంద్రంగా మార్చడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. గ్రామ పరిశుభ్రత కోసం సేకరించిన చెత్తను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాల్సిన పంచాయితీ యంత్రాంగం, అందుకు విరుద్ధంగా శ్మశానవాటికనే డంపింగ్ యార్డుగా మార్చడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇది ప్రజారోగ్యానికి కూడా ముప్పుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి శ్మశాన వాటికను చెత్తకుప్పల నుంచి విముక్తి చేసి, భవిష్యత్తులో అక్కడ చెత్త వేయకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ప్రజల మనోభావాలు, మృతుల పట్ల గౌరవం కాపాడే బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేస్తున్నారు.

# మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన పోస్టర్‌ను ఎస్‌పి రోహిత్ రాజ్ సోమవారం తన ఛాంబర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల లో ఇందుకు సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లు, సెల్ఫీ పాయింట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈనెల 26 వరకు అన్ని పాఠశాలలు, కళాశాలలు, పట్టణాలు, గ్రామాల్లో మాదక ద్రవ్యాల వలన కలిగే చెడు ప్రభావాలపై విస్తృత ప్రచారం చేయాలని, పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని తెలిపారు. సమాజంలోమార్పు వచ్చిన నాడే డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించ గలమని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్త,కదలికలను గమనించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగం వంటి వాటిపై పోలీసులు శాఖ ఖఠినంగా వ్యవహరిస్తోందని, ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ లాల్‌బాబు, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓటుపై కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి



ప్రజాపక్షం/చంద్రుగొండ:ఓటర్ల జాబితాలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని అశ్వారావుపేట ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ సూచించారు. చంద్రుగొండ మండలంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణలో జరిగే అవకతవకలు ప్రజాస్వామ్యానికి విఘాతమని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా గ్రామ, వార్డు స్థాయిలో పరిశీలించాలని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. యువత, మహిళలు, వృద్ధులు, బలహీన వర్గాల ఓటు హక్కులు కోల్పోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, రానున్న ఎన్నికల దృష్ట్యా ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు పరిశీలించాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో చంద్రుగొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోతు వెంకటరమణ, కాంగ్రెస్ నాయకులు తుమ్మ రాంబాబు, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, బోజ్యా నాయక్, తుమ్మలపల్లి సురేష్, బొర్రా సురేష్, మహేష్, యాసం కాశీ విశ్వనాథ్, కేశబోయిన నరసింహారావు, పలువురు సర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్మిక హక్కులను కాలరాస్తున్న పాలకులు



ప్రజాపక్షం/కారేపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాసే విధానాలు అవలంభిస్తున్నాయని సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. విశ్వనాథపల్లి గ్రామంలో భవన నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయు)సింగరేణి మండల గౌరవ అధ్యక్షుడు చిత్తులూరి వీరయ్య సంస్మరణ సభ శనగ రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లు తీసుకువచ్చిందని, దీంతో కార్మికుల హక్కులు బలహీనపడుతున్నాయని అన్నారు. అనంతరం భవన నిర్మాణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముదాం శ్రీను, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ మేస్త్రీ వీరయ్య వందలాది కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. అంతకు ముందు ముదాం శ్రీను వీరయ్య మేస్త్రీ స్థూపాన్ని ఆవిష్కరించగా, సీఐటీయూ మండల అధ్యక్షుడు కేలోత్ రవి జెండా ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ నరేంద్ర, నాయకులు ముక్కా సీతారాములు, ఎస్‌కె హుస్సేన్, ఉప సర్పంచ్ బొమ్మల ధనమ్మ, వీరెల్లి వెంకటేశ్వర్లు, పగడాల మంజుల, అడ్డగోడ ఐలయ్య, తిరుమలరావు, హన్మకొండ రమేష్, తురక నారాయణ, రేగళ్ల మంగయ్య, మురళి, అజయ్‌బాబు, దేవప్రకాష్, రాయమల్లు, నాగేశ్వరరావు, వెంకటప్పారావు, ఎస్‌కె సైదులు, అబ్దుల్ వాహీద్, మున్నా, కిరణ్, వినయ్‌కుమార్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

# విత్తనమేళాను సద్వినియోగపర్చుకోవాలి



ప్రజాపక్షం/గుండాల : నేడు మంగళవారం నుండి ఈ నెల 30వరకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతువేదికల్లో నిర్వహించే విత్తన మేళా కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగ పరుచుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎడిఎ తాతారావు అన్నారు. సోమవారం ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచడం, ఖరీఫ్ సీజన్ సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరి,మొక్కజొన్న, కంది, పెసర,మినుములు, నువ్వులుతదితర పంటల ధృవీకరించిన విత్తనాల వివరాలను రైతులకు తెలియజేయడంతో పాటు, ఆయాపంటలకు అనువైన విత్తన రకాలు, విత్తన శుద్ధి పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, పంట వ్యాధుల నివారణ చర్యలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలనుండి మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని , విత్తనాలకు తప్పనిసరిగా బిల్లులను పొందాలని తెలిపారు. రైతులు తప్పని సరిగా రైతువేదిల్లో నిర్వహించే విత్తన మేళాలకు రావాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సిహెచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

# రైతు వేదికలో విత్తన మేళా

ప్రజాపక్షం/ములకలపల్లి: మండలంలోని నాలుగు రైతు వేదికల్లో ఈనెల 23 నుంచి 30వరకు విత్తన మేళా నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి బి అరుణ్‌బాబు తెలిపారు. రైతులకు ప్రభుత్వం సూచించిన వరి సన్న రకాలు బీపీటీ 5204, ఆర్‌ఎన్‌ఆర్ 15048, హెచ్‌ఎంటీ సోనా, జై శ్రీరామ్ తదితర విత్తనాలతో పాటు పప్పు ధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల విత్తనాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. నానో యూరియా, నానో డీఏపీ కూడా లభిస్తాయని పేర్కొన్నారు. రైతుల సమీప రైతు వేదికలను సందర్శించి నాణ్యమైన విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కెసిఆర్ హయాంలోని సంక్షేమ పథకాలే బిఆర్ఎస్‌కు బలం



- కేసీఆర్ హయాంలో రైతు సంబురాలు, కాంగ్రెస్ పాలనలో రైతు కష్టాలు
- కేసీఆర్ ప్రభుత్వంలో నాట్లకు నాట్లకు మధ్య రైతు భరోసా
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్

**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** కేసీఆర్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలే పార్టీకి బలమని, రైతులు సంబురాలు చేసుకునే వారని, కాంగ్రెస్ పాలనలో రైతులు కష్టాలపాలవుతున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆరోపించారు. జడ్.పి.మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు ఆధ్వర్యంలో సోమవారం దెందుకూరు ఎస్.ఆర్.కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎస్ఐఆర్‌పై బూత్ లెవల్‌లో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి పనిచేయాలని, పార్టీ సభ్యత్వ నమోదులో చురుగ్గా పనిచేయాలని పిలుపునిచ్చారు. మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, కేసీఆర్ హయాంలో నాట్లకు నాట్లకు మధ్య రైతులకు రైతుభరోసా అందేదని, ఈనెల30వ తేదీన జరిగే రైతుభరోసాను సీఎంతో ఎన్ని ఎకరాలకు చేస్తారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పాలని డిమాండ్ చేశారు. రెండున్నరేళ్ల గడిచినా..మధిర నియోజకవర్గంలో ప్రజలకు ఉపయోగపడే ఒక్కపని కూడా జరగలేదని ఆరోపించారు. ఎర్రుపాలెం మండలంలోని చొప్పకట్ల పాలెం సీనియర్ నాయకుడు రమణారెడ్డి భారాసా పార్టీలో చేరిన నేపథ్యంలో వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీంద్ర, తాతా మధు, ఎం.పి.వద్దిరాజు రవిచంద్ర పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు యువత దూరం కావాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** మాదక ద్రవ్యాలు యువశక్తిని నిర్వీర్యం చేస్తున్నాయని యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ॥ అలేటి పరం జ్యోతి కోరారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నషాముక్త్ భారత్ అభియాన్ వారోత్సవాల్లో భాగంగా సోమవారం నేలకొండపల్లి జూనియర్ కళాశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ ఎస్‌డి సమీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, ఆర్థిక దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పరంజ్యోతి మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి తమ విద్య, నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసంపై దృష్టిసారించాలన్నారు. ఈ సందర్భంగా వ్యాసరచన, పోస్టర్ మేకింగ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రమీల, మానస, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ బి. వెంకటేశ్వర్‌రెడ్డి, ఐక్యూ ఏసి కో ఆర్డినేటర్ ఎస్. రమేష్ పాల్గొన్నారు.

# రైతు మేళా, సిఎం సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి



-సభ కోసం 25 ఎకరాల స్థలం
-ఈనెల 28, 29 తేదీల్లో రైతు మేళా
-30న ముఖ్యమంత్రి పర్యటన
-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జూన్ 28, 29 తేదీల్లో నిర్వహించే రైతు మేళా, జూన్ 30న చింతకాని మండలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ దివాకర టిఎస్ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తో కలిసి చింతకాని మండలంలో సభా స్థలిని పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యక్రమం కోసం భారీ స్థాయిలో సిబ్బంది వినియోగించాల్సి ఉంటుందన్నారు. అదనపు కలెక్టర్, చింతకాని తహసీల్దార్లు సభా స్థలిని పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు. సభ నిర్వహణ కోసం మొత్తం 25 ఎకరాల స్థలాన్ని సిద్ధం చేయాలని తెలిపారు.20 ఎకరాలు బహిరంగ సభకు ఐదు ఎకరాలు ప్రదర్శన కోసం కేటాయించాలన్నారు. అదనంగా వాహనాల పార్కింగ్ కోసం స్థలాన్ని గుర్తించి ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. జూన్ 28, 29 తేదీల్లో రైతుమేళా, 30న ముఖ్యమంత్రి కార్యక్రమం నిర్వహించనున్నందున అందుకు అనుగుణంగా సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. 150 స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. సభ ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలకు సంబంధించి ప్రత్యేక రూట్ మ్యాప్ సిద్ధం చేయాలన్నారు. ముఖ్యమంత్రి కార్యక్రమం పూర్తయ్యే వరకు లైజన్ అధికారులు బాధ్యత వహించాలన్నారు. మూడు రోజుల కార్యక్రమాలకు ఆహారం, తాగునీరు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. సభకు ఎల్ఈడీ స్క్రీన్లు, సౌండ్ సిస్టంలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి వ్యయాన్ని నిబంధనల ప్రకారం నిర్వహించాలని అన్ని ఖర్చులు ఆడిట్‌కు లోబడి ఉంటాయన్నారు. వేదిక నిర్వహణకు ఆర్డీవోను ఇంచార్జిగా నియమించి పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వాన పత్రాలు పంపించాలని, డిఆర్‌వో జిల్లా స్థాయి ప్రోటోకాల్ ఏర్పాట్లు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైన డ్యూటీ పాసులు, వాహన పాసులు సిద్ధం చేసి ఏ పాసుకు ఎక్కడ వరకు ప్రవేశం ఉంటుందో స్పష్టంగా పేర్కొనాలన్నారు. పాసులకు సంబంధించి 48 గంటలకు ముందు తుది జాబితాను ఖరారు చేసి పోలీస్ శాఖకు అందజేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ తగు చర్యలు తీసుకోవాలన్నారు. సిపి సునీల్ దత్ మాట్లాడుతూ గుర్తించిన స్థలాన్ని పూర్తి స్థాయిలో లెవలింగ్ చేసి పార్కింగ్ ప్రాంతాలకు, ప్రవేశ నిష్క్రమణ మార్గాలను పకడ్బందీగా రూపొందించాలన్నారు. రెండు వేర్వేరు హెలిప్యాడ్ ప్రదేశాలను గుర్తించి ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, డిఎఫ్‌వో అనూజ్ అగర్వాల్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన ఎఫ్‌సెట్ కౌన్సిలింగ్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు సంబంధించిన ఎఫ్‌సెట్ కౌన్సిలింగ్ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. స్థానిక ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన ఈ కౌన్సిలింగ్‌లో కళాశాల ప్రిన్సిపాల్ డా॥ మహ్మద్ జాకీరుల్లా విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. వివిధ స్లాట్లలో నమోదు చేసుకున్న విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. 650 మంది కౌన్సిలింగ్ కోసం పేర్లు నమోదు చేసుకోగా 620 మంది హాజరయ్యారని సాంకేతిక పర్యవేక్షకులు చందా సుధాకర్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, నల్లగొండ జిల్లాల విద్యార్థులు ఈ కౌన్సిలింగ్‌కు హాజరయ్యారని ఆయన తెలిపారు.

# యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం క్రైం :** యువత మాదక ద్రవ్యాల ఉచ్చులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని వాటికి దూరంగా ఉండాలని టౌన్ ఏసిపి రమణమూర్తి తెలిపారు. సోమవారం స్థానిక స్ట్రీమ్ పార్క్ జూనియర్ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ భవిష్యత్తు యువతపై ఉందని యువత మాదక ద్రవ్యాల భారీనపడకుండా దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు సేవించడం, విక్రయించడం, అక్రమ రవాణా వంటివి క్రిమినల్ నేరాలన్నారు. కఠిన శిక్షలు పడతాయని తెలిపారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారు వాటి నుంచి విముక్తి కోసం స్వయంగా ముందుకు వస్తే వారిపై ఎలాంటి నేర విచారణ ఉండదన్నారు. ఉచితంగా వైద్య సాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సిఐ భానుప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా వెంకటరాజ్యం



**ప్రజాపక్షం/బోనకల్:** మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన సిపిఎం నాయకురాలు, మాజీ సర్పంచ్ బంధం వెంకటరాజ్యం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ టౌన్ హాల్ ప్రాంగణంలో 20,21,22 తేదిలలో నిర్వహించబడ్డాయి. రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన ప్రతినిధులు, వ్యవసాయ కార్మికులు ఈ మహాసభల్లో పాల్గొన్నారు. అనంతరం జరిగిన రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఎన్నికల్లో వెంకటరాజ్యం ఎంపికయ్యారు. ఆమె ఎంపిక పట్ల పలువురు నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం, సంఘం బలోపేతానికి ఆమె కృషి చేయాలని ఆకాంక్షించారు.

# అన్నపూర్ణ కంపెనీ మోసం.. అప్పుల ఊబిలో రైతులు..!



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండల పరిధిలోని తాటి గూడెం గ్రామానికి చెందిన ఓ రైతు, అన్నపూర్ణ పేరుతో విత్తనాల సాగు చేపట్టి తీవ్రంగా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. రెండో పంట సాగు కోసం తమ గ్రామానికి వచ్చిన కంపెనీ ప్రతినిధులు ఎకరానికి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని, ఎకరానికి రూ.70 వేల వరకు ఇన్సూరెన్స్ వర్తిస్తుందని, పెట్టుబడి కూడా కంపెనీయే భరిస్తుందని, పంటను తామే కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారని రైతు తెలిపారు. ఆ హామీలను నమ్మి తాను 10 ఎకరాల భూమిలో సాగు చేయడానికి ముందుకొచ్చానని చెప్పారు. అన్నపూర్ణ కంపెనీ పేరుతో విత్తనాలు ఇస్తామని చెప్పి, జెకే సీడ్‌కు చెందిన విత్తనాలను అందజేశారని ఆరోపించారు. వాటిని 10 ఎకరాలకు సరిపడా సిద్ధం చేసుకుని, దుక్కి పనులు పూర్తి చేసి నాట్ల కోసం పొలాలను సిద్ధం చేశానని తెలిపారు. అయితే కంపెనీ ప్రతినిధులు కేవలం నాలుగు ఎకరాల్లో మాత్రమే నాట్లు వేయించారని, మిగిలిన ఆరు ఎకరాల్లో సాగు చేపట్టకుండా నిలిపివేశారని రైతు ఆరోపించారు. ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించగా, సమయం దాటిపోయిందని, ఇక సాగు చేయొద్దని చెప్పారని వివరించారు. దీంతో సాగు కోసం సిద్ధం చేసిన భూమి నిరుపయోగంగా మారిందని, అందులో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకున్న భూమి కావడంతో యజమానులకు ముందుగానే చెల్లించిన డబ్బులు కూడా నష్టపోయానని పేర్కొన్నారు. అంతేకాకుండా, సాగు చేసిన నాలుగు ఎకరాలకు కూడా కంపెనీ వాగ్దానం చేసిన విధంగా పెట్టుబడి అందించలేదని రైతు ఆరోపించారు. ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని చెప్పినప్పటికీ, మూడు క్వింటాళ్ల దిగుబడి కూడా కష్టంగా వచ్చిందని తెలిపారు. ఇన్సూరెన్స్ సదుపాయం కల్పిస్తామని చెప్పినా, అనంతరం అలాంటి సౌకర్యం లేదని చెప్పారని వాపోయారు. ఇప్పటికే కంపెనీకి సంబంధించిన ఆర్థిక లావాదేవీల విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని, తమకు న్యాయం చేయాల్సింది పోయి భూములు రాయించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తాము ఎదుర్కొన్న నష్టాలపై పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను అధికారులు వెంటనే పరిశీలించి, కంపెనీ ప్రతినిధుల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని బాధిత రైతు ప్రభుత్వాన్ని కోరారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు సంబంధిత శాఖలు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని లేకుంటే మండలంలో ఆదివాసి రైతుల తోటి ఆందోళన చేస్తామని ఆదివాసి జేఏసీ కమిటీ అధ్యక్షులు గొగ్గెల కృష్ణ పత్రికా ప్రకటనలో తెలిపారు.

# మురికికూపాలుగా జనావాసాలు..!

### ఇబ్బందులు పడుతున్న ప్రజలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని చెన్నూర్, పెద్ద కోరుకొండి గ్రామాలలో ఇటీవల కురిసిన వర్షానికి గాను గృహాల మధ్య లోతట్టు గుంతలు ఉండటం వలన చుట్టుపక్కల ఆవాసంగా ఉన్న గృహస్తులు దుర్వాసన వస్తుండటంతో మరియు అచ్చటనే ఈగలు, దోమలు ఆవాసంగా మారి ఉండటానికి అనుకూలంగా లేకపోవడంతో ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెన్నూరు లోని ఎస్సీ మాలపల్లి లో ఉన్న గృహాల మధ్య లోతట్టుగుంట ఉండటం వల్ల దుర్వాసన కంపు వాసన తో ఈగలు దోమలు తో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలుపుతున్నారు. అదేవిధంగా పెద్ద కోరుకొండిలోని వెన్నవల్లి వెళ్తున్న రహదారి వెంట మురికి నీరు నిల్వ ఉండటం వలన ప్రజలు దుర్వాసనకు ఇబ్బందులు పడుతున్నారు. దీనివలన రాకపోకలు చేస్తున్న వాహనదారులు ప్రజలు ఇబ్బందు ఇబ్బందులు పడుతున్నారు. దీంతోపాటు సమీపంలో ఉన్న గృహస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీనివలన ఈగలు దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు పంచాయతీ కార్యదర్శులను డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీవో ఏనుగు సురేష్ బాబును వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి నీటిని తొలగించి బ్లీచింగ్ చల్లిస్తామని లేనిచో నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# నారిభేరి కార్యక్రమానికి తరలివెళ్లిన మహిళలు



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మంలో జరిగిన మహిళా నారీ భేరి అభ్యుదయం కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణగౌడ్ సూచనల మేరకు వైరా మున్సిపాలిటీత 13వ వార్డు కౌన్సిలర్ ముళ్ళపాటి విజయలక్ష్మి, 4వ వార్డు వేముల శ్రావణి ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున ఖమ్మం నారీ భేరి కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఖమ్మం వెళుతున్న బస్సులను కౌన్సిలర్లు ముళ్ళపాటి విజయలక్ష్మి, వేముల శ్రావణి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.